సాక్షి
చిత్తూరు
శనివారం। 17। ఆగస్టు। 2024



మరో 'గ'ఘన' విజయం
షార్ మొదటి ప్రయోగ వేదిక నుంచి ప్రవేశపెట్టిన ఎస్ఎస్ఎల్‌వీ డీ3 ప్రయోగం విజయవంతమైంది. - 8లో



సమస్యలు లేని కుప్పంగా..
జిల్లాలోనే సమస్యలు లేని నియోజకవర్గంగా కుప్పంను తీర్చిదిద్దాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. - 8లో



'నిలువెత్తు' సేద్యం
కూలీల కొరతను అధిగమించేందుకు రైతులు ఇప్పుడు నిలువు పందిరి పంటల సాగుపై మక్కువ చూపుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

డమ్మీ డాక్టర్లపై ఇంటెలిజెన్స్ ఆరా!

సాక్షి ఎఫెక్ట్..

కాణిపాకం: జిల్లాలోని డమ్మీ డాక్టర్లపై ఇంటెలిజెన్స్ వర్గం ఆరా తీస్తోంది. నియోజకవర్గాల వారీగా ఆ విభాగ అధికారులు నకిలీ వైద్యుల విచారణలో పడ్డారు. ఈ నెల 3న సాక్షి దినపత్రికలో డమ్మీ డాక్టర్ అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి విచారణ పూర్తి చేశారు. ఆ నివేదికలను జిల్లా అధికారులు రాష్ట్ర అధికారులకు పంపారు. అయితే దీనిపై ఇంటెలిజెన్స్ వర్గం కూడా విచారణకు దిగింది. నియోజకవర్గాల వారీగా డమ్మీ డాక్టర్ల గుట్టుపై వివరాలు ఆరా తీస్తున్నారు. అనధికారికంగా ఆస్పత్రులు నిర్వహిస్తున్న వైద్యులు, మెడికల్ షాపుల పేరుతో క్లినిక్‌లు నడిపిస్తున్న వారు, ఆర్ఎంపీల పేరుతో రెచ్చిపోతున్న వారి వివరాలను లోతుగా విచారిస్తోంది.

దోమల విజృంభణతో వ్యాధులు



మాదిరెడ్డిపల్లెలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి

యాదమరి (పూతలపట్టు): దోమల విజృంభణతో వచ్చే వ్యాధులను అరికట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రభావతి తెలిపారు. యాదమరి మండలం రసూల్‌పల్లెను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న ఫ్రైడే డ్రై డేను పరిశీలించారు. దోమల వల్ల విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని, వీలైనంత వరకు దోమలను అరికట్టాలని గ్రామస్తులు, ఆశావర్కర్లను ఆదేశించారు. గ్రామంలో నెలకొన్న పారిశుధ్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వృథాగా వీధుల్లో పారుతున్న నీటిని అరికట్టడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. తద్వారా మురుగు కాలువల్లో నిలిచిపోయి అక్కడ లార్వాలు పుట్టి, దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు వ్యాపించడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పారిశుధ్యంలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. వీరి వెంట జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, సబ్ యూనిట్ అధికారి పీరు సాహెబ్, ఆరోగ్య శాఖా సిబ్బంది పాల్గొన్నారు.

17,19 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సర్కారు బడుల్లో ఈ నెల 17, 19 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 17, 19 తేదీల్లో ఖచ్చితంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు కింది స్థాయి అధికారులను ఆదేశించారు. సమావేశాలు నిర్వహించకపోతే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఉద్యోగుల వివరాలు ఇవ్వండి

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలో ఒకే స్థానంలో ఐదేళ్లుగా పనిచేస్తున్న వారి వివరాలను పంపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు అన్ని స్థాయిల్లో ఉన్న ఉద్యోగుల సమాచారం పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందులో ఉద్యోగుల ఆరోగ్య పరమైన సమాచారం కోరారు. వాటిని సిద్ధం చేసే పనిలో జెడ్పీ అధికారులు నిమగ్నమయ్యారు.

ఆ పాఠశాలల్లో నేడు ఎస్ఎంసీ ఎన్నికలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇటీవల పెండింగులో ఉన్న పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు శనివారం నిర్వహించాలని జిల్లా సమగ్ర శిక్ష అధికారులకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికల నిర్వహణ, మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక, మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణస్వీకారం, మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు ఎస్ఎంసీ కమిటీ మొదటి సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు ఎంపీపీ పాఠశాల, మంకలదొడ్డి (కుప్పం), జెడ్పీ హైస్కూల్ వసనాడు (కుప్పం), ఎంపీయూపీ, (పాలసముద్రం), జెడ్పీ కొత్తపల్లిమిట్ట (ఎస్ఆర్‌పురం), ఎంపీపీ కొప్పేడు (నింద్ర మండలం), జెడ్పీ కొట్టాలం (యాదమరి), ఎంపీపీ కీలపొరాడి (బైరెడ్డిపల్లి) పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

• వరలక్ష్మీ వైభవం!



కాణిపాకం: వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

సిరి సంపదలు చేకూర్చే వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అందులో ప్రధానంగా స్వయంభు శ్రీ కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ వరదరాజ స్వామి ఆలయంలో వేద పండితులు సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు మధ్యాహ్నం ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి కొలువు దీర్చారు. అనంతరం వరలక్ష్మీ వ్రతం జరిపించారు. ఆలయ ఈవో వాణి, మహిళలు హాజరై ఈవ్రతం ఆచరించారు. చిత్తూరు నగరంలోని ముత్తుమారియమ్మ తల్లి పుష్పప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. - కాణిపాకం



చిత్తూరు: పుష్ప ప్రభ వాహనంపై ఊరేగుతున్న ముత్తుమారియమ్మ

అన్న క్యాంటీన్ల పేరుతో కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నారు. ఇదివరకు ఉన్న రేకుల షెడ్లు, భవనాలకు చిన్నపాటి మరమ్మతుల పేరుతో లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన మున్సిపల్, కార్పొరేషన్ సాధారణ నిధులను మింగేస్తున్నారు. కూటమి పెద్దల మౌఖిక ఆదేశాలతో అధికారులు సైతం పనులను అంచనా వేయకుండా సంతకాలు పెట్టి చెక్కులిచ్చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రెండంతస్తుల శాశ్వత సచివాలయ భవనానికి రూ.40 లక్షలు వెచ్చించగా.. నేడు తాత్కాలిక షెడ్లలో ఏర్పాటు చేసే అన్న క్యాంటీన్ మరమ్మతులకు రూ.20 లక్షల వరకు ఖర్చుచేస్తున్నారు. పసుపు రంగు అద్ది ప్రచార పర్వానికి తెరలేపుతున్నారు. కూటమి ప్రభుత్వంలో కీలక నేత అయిన డెప్యూటీ సీఎం ఫొటో లేకుండానే ఊదరగొట్టుకుంటున్నారు. దీనిపై జనసైనికులు సైతం రగిలిపోతున్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టడంలో తప్పులేదు గానీ.. ఇలా ప్రభుత్వ నిధులు ఇష్టారాజ్యంగా దోచిపెట్టడమేంటని పలువురు ప్రశ్నలు సంధిస్తున్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణ, ఏర్పాట్లపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్. - సాక్షి ప్రతినిధి, తిరుపతి



తిరుపతిలోని బైరాగిపట్టెడ ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద పసుపు రంగులతో అన్న క్యాంటీన్ ఏర్పాటు

అన్నార్పణం

2014-2019 మధ్య ప్రారంభమైన అన్న క్యాంటీన్లు

ప్రాంతం	ఒక్కో క్యాంటీన్‌కి కేటాయించిన మొత్తం	ప్రాంతం	ఒక్కో క్యాంటీన్‌కి కేటాయించిన మొత్తం
తిరుపతిలో 4	రూ.1.12 కోట్లు	నగరి	రూ.30లక్షలు
చిత్తూరు	రూ.30 లక్షలు	పుత్తూరు	రూ.30 లక్షలు
కుప్పం	రూ.30 లక్షలు	శ్రీకాళహస్తి	రూ.30 లక్షలు
పుంగనూరు	రూ.30 లక్షలు	పలమనేరు	రూ.30 లక్షలు
మొత్తం రూ.3.3 కోట్లు			

అన్న క్యాంటీన్ల రిపేర్ల పేరుతో తమ్ముళ్ల జేబుల్లోకి ప్రభుత్వ నిధులు

- రూ.3 లక్షలయ్యే రిపేర్లకు రూ.13 లక్షల నుంచి రూ.20 లక్షలు
- కార్పొరేషన్, మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి కేటాయింపు
- నాటి టీడీపీ హయాంలో ఒక్కో క్యాంటీన్‌కి రూ.30 లక్షలు
- ఒక్కో రేకుల షెడ్డుకి రూ.50 లక్షల వరకు ఖర్చు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండంతస్తుల సచివాలయ శాశ్వత భవనానికి రూ.40 లక్షలే
- పేదల భోజనం పేరుతో తమ్ముళ్లకు దోచిపెడుతున్న కూటమి పెద్దలు
- డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనసైనికులు

గ్రౌండ్ రిపోర్ట్

రిపేర్లకే ఇన్ని లక్షలా?



పుంగనూరులో అన్న క్యాంటీన్

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని 16 అన్న క్యాంటీన్లు పునఃప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. రిపేర్ల పేరుతో ఎంతైనా ఖర్చు చేసుకునేలా ఆదేశాలిచ్చారు. అందులో భాగంగా రూ.5 లక్షల నుంచి ఎంత ఖర్చయితే అంత కాంట్రాక్టర్‌కి చెల్లించేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇదే అదునుగా అన్న క్యాంటీన్ కాంట్రాక్టర్లు (టీడీపీ శ్రేణులు) రూ.13 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చుచేస్తున్నట్లు లెక్కలుగడుతున్నారు. ఈ నిధులన్నీ కార్పొరేషన్, మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వెచ్చిస్తున్నారు. వీటికి వెచ్చించే నిధులు మొత్తం రూ.2.08 కోట్ల నుంచి రూ.3.2 కోట్ల దాకా ఉంటోంది.

ఈనెల 16న ప్రారంభించిన క్యాంటీన్లు

- కుప్పం, పలమనేరు, పుంగనూరు
- నాటి టీడీపీ ప్రభుత్వం.. నేటి కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లకు వెచ్చించిన నిధులు: రూ.5.38 కోట్ల నుంచి రూ.6.5 కోట్ల వరకు
- రూ.50 లక్షలు వెచ్చించిన అన్న క్యాంటీన్ స్వరూపం
- నాలుగు గోడలు, పైన పది రేకులు, నాలుగువైపులా నాలుగు అద్దాలు
- నిల్చొని భోజనం చేసేందుకు రెండు, మూడు టేబుళ్లు
- మొత్తంగా తాత్కాలిక షెడ్డు

ప్రచారమంటే 'పచ్చ రంగుపడుద్ది'

పేదలకు భోజనం పెట్టటం దేవుడెరుగు.. ఆ పేరుతో టీడీపీ ప్రచారం చేసుకునేందుకు అన్న క్యాంటీన్లకు పచ్చ రంగులు వేయడంపై ఆ పార్టీ నేతలు శ్రద్ధ చూపుతున్నారు. అందులో భాగంగానే అన్న క్యాంటీన్లు అన్నింటికీ పచ్చ రంగులు వేస్తున్నారు. గత ప్రభుత్వంలో కొన్ని భవనాలకు బ్లూ, తెలుపు రంగులు వేస్తే కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అనుకూలమైన రంగులు వేస్తోందంటూ రాద్ధాంతం చేశారు. మరి నేడు టీడీపీ శ్రేణులు చేస్తున్నదేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



తిరుపతి ముత్యాలరెడ్డిపల్లెలో..



శ్రీకాళహస్తిలోని అన్న క్యాంటీన్

రూ.40 లక్షలతో గ్రామ, వార్డు సచివాలయాలు

సిమెంటు కాంక్రీట్‌తో నిర్మించిన రెండంతస్తుల శాశ్వత భవనం. పంచాయతీరాజ్‌శాఖ పూర్తిచేసిన ఈ భవనంలో కింద పోర్షన్‌లో నాలుగు గదులు. పైన అంతస్తులో మరో నాలుగు గదులు. గ్రామ, వార్డులో ఉన్న వారితో సమావేశం కావడానికి అనుకూలంగా మీటింగ్ హాలు. ఇంకా స్థానిక సర్పంచ్‌కి ఓ గది. ప్రభుత్వంలో ఉన్న వివిధ శాఖలకు వేర్వేరు గదులు. సచివాలయంలో రెండు కంప్యూటర్లు, రెండు సీపీయూలు, ప్రింటర్, యూపీఎస్, టేబుళ్లు, కుర్చీలు, బీరువాలు, ఫ్యాన్లు ఇతరత్రా. నాణ్యతలో ఏమాత్రం రాజీ పడకుండా.. కార్పొరేట్ స్థాయిలో రూ.40 లక్షలు వెచ్చించి సచివాలయాల కోసం భవనాలను నిర్మించింది. ఒక్కో సచివాలయంలో 250 కుటుంబాల నుంచి 500 కుటుంబాల వారు సేవలు పొందుతున్నారు.



గతంలో 16 అన్న క్యాంటీన్లు

అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం పేరుతో కూటమి ప్రభుత్వం భారీగా నిధులు దుర్వినియోగానికి పాల్పడుతోంది. గత టీడీపీ పాలనలో చూస్తే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మొత్తం 16 అన్న క్యాంటీన్లు ఉండేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని కుప్పం, పుంగనూరు, పలమనేరు, నగరి పట్టణాల్లో క్యాంటీన్లను ప్రారంభించనుంది. మొదటి విడతలో తిరుపతి జిల్లాలో అన్న క్యాంటీన్లు ప్రారంభానికి నోచుకోలేదు.



కుప్పంలో..

అన్న పేరుతో తమ్ముళ్లకు విందు

గత టీడీపీ పాలనలో తాత్కాలిక షెడ్లలో ప్రారంభించిన అన్న క్యాంటీన్లు నేడు అలానే ఉన్నాయి. అయితే వాటికి ఉన్న పచ్చ రంగులు మాత్రం లేవు. ప్రస్తుతం రిపేర్ల పేరుతో భారీగా నిధులు ఖర్చుచేస్తున్నారు. రంగులు, ఇతరత్రా వాటిని బాగుచేయాలంటే గట్టిగా అంటే రూ.3 లక్షలు ఎక్కువ. అటువంటిది రూ.13 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చయినట్టు లెక్కలు గడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రూ.3.3 కోట్లు వెచ్చించి బిల్లులు చేసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం బాగున్నా.. వాటి రిపేర్ల పేరుతో భారీగా నిధులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.





పలమనేరులోని అన్న క్యాంటీన్

పవన్ ఫొటో ఎగ్గొట్టేశారు!

ప్రభుత్వంలో కూటమి నేతలంతా సమానమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు పలుమార్లు చెప్పుకుంటూ వచ్చిన విషయం తెలిసిందే. ఏదైనా తేడా వస్తే ప్రభుత్వానికి ఇబ్బంది తప్పదని భావించిన టీడీపీ ముఖ్యనేతలు ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం ఫొటోతో పాటు పవన్‌కళ్యాణ్ ఫొటో కూడా ఏర్పాటు చేశారు. అయితే నేడు ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్లపై ఎన్టీఆర్, చంద్రబాబు ఫొటోలు తప్ప ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫొటో ముద్రించలేదు. దీనిపై జనసేన నాయకులు మండిపడుతున్నారు. అప్పుడే పవన్ కళ్యాణ్ అంటే విలువ లేదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేదలు సంచరించే ప్రాంతాల్లో ఏర్పాటు చేయండి

నేడు అట్టహాసంగా ప్రారంభిస్తున్న అన్న క్యాంటీన్లు అత్యవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతి రుయా, తుడా కూడలి, ఆటోనగర్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఎక్కువ మంది చిరు వ్యాపారులు, కార్మికులు అధికంగా ఉంటారు. అదేవిధంగా తిరుపతి రూయా ఆసుపత్రికి నిత్యం వేలాది మంది రోగులు, వారి బంధువులు వచ్చి వెళ్తుంటారు. ఈ ప్రాంతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే రోగులు, వారి కుటుంబీకులకు అనుకూలంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.



తిరుపతిలో స్విమ్స్ ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్

దేశంలో వైద్యులకు రక్షణ కరువు

• జిల్లా ఆస్పత్రిలోని ఓపీ సేవలు బంద్



చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న పీజీ డాక్టర్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దేశంలో వైద్యులకు రక్షణ కరువైందంటూ గైనిక్ వైద్యురాలు ఉషశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా చిత్తూరు జిల్లా ఆస్పత్రిలోని పీజీ డాక్టర్లు శుక్రవారం రోడ్డెక్కారు. అత్యవసర సేవకు మినహాయింపు ఇచ్చి ఓపీ సేవలు నిలిపివేసి ధర్నాకు దిగారు. దుస్తులపై ఎర్రని హస్తం గుర్తులతో నిరసన తెలిపారు. ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ చేశారు. గాంధీ మహాత్ముని విగ్రహం వద్ద కాసేపు ధర్నా చేసి మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. తదనంతరం ఆస్పత్రి ఆవరణలో దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ వైద్యవిద్యలో భద్రత ఉంటుందని తల్లిదండ్రులు ఖర్చులకు వెనకడుగు వేయకుండా వైద్య కళాశాలలకు పంపుతున్నారన్నారు. అయితే ఈ వ్యవస్థ ముందు మాదిరిగా లేదన్నారు. ప్రాణం పోసే డాక్టర్లకు ఈ దేశంలో పూర్తిగా రక్షణ కరువైందని చెప్పారు. ఎన్ని చట్టాలు ఉన్నా అవి తెల్లకాగితాలకే పరిమితమవుతున్నాయని పేర్కొన్నారు. కోల్‌కతా ప్రభుత్వ కళాశాల ఆస్పత్రిలో ఈ నెల 9వ తేదీ రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా వైద్యురాలిపై అమానుషంగా హత్యాచారం చేశారని మండిపడ్డారు. ఇలాంటి దారుణానికి ఒడిగట్టిన ఉన్మాదులను వదిలిపెట్టకూడదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఈ విషయంలో సత్వర న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ధర్నా కార్యక్రమాలు ఉధృతమవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, మొగిలేష్, నవీన్, రెడ్డి తేజ, కావ్య, మేఘన, శివ, క్రిష్ణ, గోపినాథ్, చెన్నయ్య తదితరులున్నారు. ఓపీ సేవలు బంద్ కావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

18న టీ-20 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

సదుం: జిల్లా టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక స్థానిక జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు ఏపీ టీ-20 క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అద్వైత్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ఆసక్తి ఉన్న వారు హాజరు కావాలని కోరారు. అండర్-16, అండర్-19, సీనియర్స్ విభాగంలో ఎంపిక ఉంటుందన్నారు. వివరాలకు 97015 15415, 8309365583ను సంప్రదించాలని కోరారు.

నేడు వైద్య సేవలు బంద్



మాట్లాడుతున్న చిత్తూరు శాఖ కార్యవర్గ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారం కేసులో సత్వర న్యాయం డిమాండ్ చేస్తూ శనివారం బంద్ చేస్తున్నట్లు ఐఎంఏ చిత్తూరు శాఖ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి రమణరెడ్డి తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో, అత్యవసర సేవలు మినహాయించి, ఓపీడీ సేవలు, అత్యవసరం కాని శస్త్ర చికిత్సలు పూర్తిస్థాయిలో నిలిపి వేస్తున్నామన్నారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి, సీబీఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేసి, నేరానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. ఆస్పత్రుల్లో డ్యూటీలో ఉన్న వైద్యులకు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక రక్షణ చట్టాలు కేంద్ర స్థాయిలో తీసుకురావాలని కోరారు. తమ డిమాండ్లు సాధించేవరకు ఈ ఉద్యమాన్ని ఆపేది లేదని, అవసరమైతే మరింత తీవ్రతరం చేస్తామని, దీనికి ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు మద్దతు ఇవ్వాలని వారు కోరారు.

క్లుప్తంగా

బోయకొండలో రాహుకాల అభిషేక పూజలు



చౌడేపల్లి: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరొందిన బోయకొండ గంగమ్మకు శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయంలో శాస్త్రోక్తంగా అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం బంగారు ఆభరణాలు, పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో భక్తులకు పవిత్ర తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని పూజలు చేశారు.

బైక్‌ను ఢీకొన్న లారీ యువకుడి దుర్మరణం



లోకేష్ (ఫైల్)

చౌడేపల్లి: బైక్‌ను లారీ ఢీ కొనడంతో మండలానికి చెందిన యువకుడు మృతి చెందిన సంఘటన కర్ణాటకలో చోటుచేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు మండలం కేటీ స్ట్రీట్‌కు చెందిన కరమల లోకేష్(19) బెంగళూరులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితుడు పవన్‌తో కలిసి గురువారం బైక్‌పై బెంగళూరు నుంచి చౌడేపల్లెకు బయల్దేరారు. మార్గమధ్యంలోని చిక్‌బళాపురం వద్ద బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ఘటనలో లోకేష్ మృతి చెందగా పవన్ తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతున్నారు. యువకుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పోక్సో కేసులో నిందితుడు అరెస్టు

చిత్తూరు అర్బన్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడిని చిత్తూరు టూటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. చెన్నైకు చెందిన మహిళ పొట్టకూటి కోసం దుబాయ్ వెళుతూ ఇటీవల తన ఆరేళ్ల కుమార్తెను కాజూరులోని తన స్నేహితురాలు పవిత్ర ఇంట్లో వదలి వెళ్లింది. చిన్నారిపై పవిత్ర దాడి చేయడం, ఆమె భర్త సతీష్(32) లైంగికదాడికి పాల్పడ్డట్లు గుర్తించిన బాధితురాలి తల్లి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సతీష్‌ను అరెస్టుచేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రిమాండు విధించారు.

మరో గఘన విజయం

- ఎస్ఎస్ఎల్‌వీ డీ3 ప్రయోగం విజయవంతం
- ఇస్రో అమ్ములపొదిలో వజ్రాయుధం ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్
- వాణిజ్యపరమైన ప్రయోగాల వైపు ఇస్రో చూపు

సూళ్లూరుపేట: షార్‌లో మొదటి ప్రయోగవేదిక నుంచి శుక్రవారం ఉదయం 9.17 గంటలకు ఎస్ఎస్ఎల్‌వీ డీ3 ప్రయోగంతో మరో 'గఘన' విజయాన్ని నమోదు చేశారు. స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ డీ3) ప్రయోగానికి శుక్రవారం వేకువజామున 2.17 కౌంట్‌డౌన్‌ను ప్రారంభించి ఉదయాన్నే 9.17 గంటలకు ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రయోగం ద్వారా రెండు ఉపగ్రహాలను భూమికి అతి తక్కువ దూరంలోని 475 కి.మీ ఎత్తులోని లియో ఆర్బిట్ (సూర్య సమకాలిక కక్ష్య)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇప్పటి దాకా ఐదు రకాల రాకెట్‌లను రూపొందించుకుని దేశీయ ఉపగ్రహాలు, వాణిజ్యపర ఉపగ్రహాలను ప్రయోగిస్తూ వచ్చారు. ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్ విజయవంతం కావడంతో ఆరో రాకెట్‌గా ఇస్రో అమ్ముల పొదిలో మరో వజ్రాయుధం చేరింది. ఇక నుంచి ఇస్రో వాణిజ్యపరమైన ప్రయోగాల స్పీడ్ కూడా పెరిగే అవకాశం లేకపోలేదు.

రాకెట్ ప్రయోగమిలా...

- ఎస్ఎస్ఎల్‌వీ డీ3 రాకెట్ 34 మీటర్లు పొడవు, రెండు మీటర్లు వెడల్పు
- 119 టన్నుల బరువుతో నాలుగు దశల్లో 16.56 నిమిషాలకు ప్రయోగాన్ని పూర్తి
- 87 టన్నుల ఘన ఇంధనాన్ని ఉపయోగించి 130 సెకండ్లకు మొదటి దశను విజయవంతంగా పూర్తి
- 162.3 సెకండ్లకు రాకెట్ శిఖరభాగాన ఉపగ్రహాలను అమర్చిన హీట్‌షీల్డ్ విడిపోవడం
- 7.7 టన్నుల ఘన ఇంధనంతో 405.3 సెకండ్లకు రెండో దశ పూర్తి
- 4.5 టన్నుల ఘన ఇంధనంతో 698.5 సెకండ్లకు పూర్తి
- నాలుగో దశలో వెలాసిటీ ట్రిమ్మింగ్ మోటార్‌లో నింపిన 0.05 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో 706.7 సెకండ్లకు కటాఫ్
- వెలాసిటీ ట్రిమ్మింగ్ మోటార్‌ను కటాఫ్ చేసిన తరువాత 816.6 సెకండ్లకు 175.5 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహాన్ని భూమికి 475 కిలోమీటర్లు ఎత్తులోని లియో ఆర్బిట్‌లోకి మొదటిగా విజయవంతంగా ప్రవేశపెట్టడం
- 16.56 నిమిషాలకు ఎస్ఆర్-0 డెమో శాట్‌ను కూడా విజయవంతంగా ప్రవేశపెట్టి ప్రయోగాన్ని అనుకున్నది అనుకున్నట్టుగా నిర్వహించారు.
- కక్ష్యలోకి చేరుకున్న ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందడం, ఉపగ్రహాలకు సోలార్ ప్యానెల్స్ విచ్చుకోవడం వంటివి జరగడంతో ఉపగ్రహాలు ఆరోగ్యకరంగా ఉన్నాయని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రకటించారు.
- షార్ నుంచి 94వ ప్రయోగం ఎస్ఎస్ఎల్‌వీ డీ3 రాకెట్.
- ఎస్ఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది మూడో రాకెట్.



నిప్పులు చిమ్ముకుంటూ నింగివైపు వెళుతున్న ఎస్ఎస్ఎల్‌వీ డీ2 రాకెట్

అత్యంత తక్కువ వ్యయం..ఆరోరకం!


అత్యంత తక్కువ వ్యయంతో విదేశాలకు చెందిన బుల్లి ఉపగ్రహాలతో పాటుగా ఒక మోస్తరు బరువున్న ఉపగ్రహాలను, దేశ విదేశాల్లో ఉన్న ఐఐటీ విద్యార్థులు ప్రయోగాత్మకంగా తయారు చేసిన ప్రయోగించేందుకు ఇప్పటి దాకా పీఎస్ఎల్‌వీ రాకెట్‌ను ఉపయోగించేవారు. దీనికంటే కూడా ఇంకా తక్కువ వ్యయంతో చిన్న తరహా ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించేందుకు ఒక చిన్న రాకెట్‌ను రూపొందించేందుకు 2016లోనే ప్రణాళికను రచించారు. 2020లోనే ఈ ప్రయోగాన్ని నిర్వహించాలనుకున్న సమయంలో కరోనా మహమ్మారి వల్ల ప్రయోగం ఆలస్యమైంది. చిన్న తరహా ఉపగ్రహాలను ఈ స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్‌ను డిజైన్ చేశారు. అయితే 2022 ఆగస్టు 7న ఎస్ఎస్ఎల్‌వీ డి1 పేరుతో చేసిన ప్రయోగమంతా విజయవంతంగా నిర్వహించినప్పటికీ ఉపగ్రహాలు కూడా కక్ష్యలోకి ప్రవేశించినట్టుగా గ్రౌండ్‌స్టేషన్‌కు సిగ్నల్స్ అందాయి. మరు నిమిషంలో ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందకపోవడంతో ఈ ప్రయోగం విఫలమైనట్టుగా ఇస్రో ప్రకటించింది. ఆ ప్రయోగంలో జరిగిన పొరబాట్లను సరిచేసుకుని 2023 ఫిబ్రవరి 10న అత్యంత అధునాతనమైన సాంకేతిక పరికరాలను రూపొందించుకుని ఎస్ఎస్ఎల్‌వీ డీ2 రాకెట్‌ను ప్రయోగించి విజయాన్ని నమోదు చేసుకున్నారు. అదే విధంగానే ఎస్ఎస్ఎల్‌వీ డీ3లో కూడా అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించి విజయాన్ని నమోదు చేసుకున్నారు. దీంతో ఇస్రోకు ఆరోరకం రాకెట్‌గా ఎస్ఎస్ఎల్‌వీ ఇస్రో జాబితాలో చేరింది. ఇప్పటిదాకా ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్లను మాత్రమే డిజైన్ చేశారు. సరికొత్తగా ఎస్ఎస్ఎల్‌వీ కూడా ఇస్రో జాబితాలో చేరింది.



మొదటి దశలో మండుతూ వెళ్లి ఆగిపోయిన రాకెట్




రెండో దశలో మండుకుంటూ వెళుతున్న రాకెట్



రాకెట్‌కు శిఖరభాగాన ఉపగ్రహాలను అమర్చిన హీట్‌షీల్డ్ ఊడిపోతున్న దృశ్యం



మూడో దశలో మండుతూ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న రాకెట్



వెలాసిటీ ట్రిమ్మింగ్ మోటార్ నుంచి కక్ష్యలోకి విడిపోతున్న ఈఓఎస్-08 ఉపగ్రహం

వరసిద్ధుని సేవలో అయ్యన్న పాత్రుడు



కాణిపాకం ఆలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సమేతంగా శుక్రవారం కాణిపాకం చేరుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి మంచి భవిష్యత్ ప్రసాదించాలని స్వామి వారిని ప్రార్థించినట్లు చెప్పారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

వి.కోట : విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు, మండలంలోని బోడిగుట్లపల్లి పంచాయతీ దొడ్డిపల్లెలో రాణెమ్మ (52) వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గంగమ్మ ఆలయాన్ని శుభ్రం చేసింది. నీటితో కడుగుతూ గుడిలోని స్విచ్‌బోర్డును తాకి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించింది. దీనిపై ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

సమస్యలు లేని కుప్పంగా మార్చుదాం

కుప్పం: జిల్లాలో కుప్పం నియోజకవర్గాన్ని సమస్యల రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం మండలం పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై 158 వినతులు ఆయనకు అందజేశారు. వీటిలో అధికంగా 88 రెవెన్యూ శాఖకు సంబంధించినవిగా గుర్తించారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం మండలం పరిధిలోని నడుమూరు అటవీశాఖ బీట్ ఏనుగుల దాడిలో నష్టపోయిన ఏడుగురు రైతులకు రూ.80 వేల చెక్‌ను కలెక్టర్‌తోపాటు కడా పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చేతులమీదుగా అందజేశారు.



రైతులకు నష్టపరిహారం చెక్ అందిస్తున్న కలెక్టర్

రోడ్డు ప్రమాదం.. తండ్రీ కుమార్తె దుర్మరణం





అబ్బాస్ హుస్సేన్, షబ్‌నమ్ (ఫైల్)

గంగాధరనెల్లూరు: రోడ్డు ప్రమాదం రూపంలో ఆ కుటుంబాన్ని మృత్యువు వెంటాడింది. పీర్ల పండగకు బైక్‌పై బయల్దేరిన ఆ కుటుంబం క్షణకాలంలో ఛిన్నాభిన్నమైపోయింది. ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న తండ్రీ, కుమార్తె మృతి చెందగా, తల్లీ, ఆరునెలల చిన్నారి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు బాలగంగానపల్లెకు చెందిన అబ్బాస్ హుస్సేన్ (30) కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఈయనకు భార్య వాసిమా (26), కుమార్తె షబ్‌నమ్(03)తోపాటు ఆరు నెలల మరోపాప తంజీమ్ ఉన్నారు. పక్క ఊరు వీరకనెల్లూరులో పీర్ల పండుగకు బైక్‌పై ఇద్దరు పిల్లలు, భార్యతో కలిసి బయల్దేరారు. చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై నెల్లేపల్లి బొబ్బిగానిపల్లె మధ్యలో కార్వేటినగరం నుంచి వచ్చిన కారు ఎదురుగా ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అబ్బాస్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమయంలో 108 కోసం నిరీక్షించగా సుమారు గంట తరువాత సంఘటనా స్థలికి చేరుకుంది. అక్కడిని మిగతా ముగ్గురిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ షబ్‌నమ్ కన్నుమూసింది. మిగతా ఇద్దరి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం.. వృద్ధురాలికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన సుశీలమ్మ

గుడిపాల: బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల వృద్ధురాలికి తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం ఉదయం తమిళనాడు సరిహద్దులోని ఓలేటికండ్రిగ గ్రామానికి చెందిన సుశీలమ్మ(64) అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో చీలాపల్లెలోని సీఎంసీ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొంది చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై బస్సు కోసం వేచి చూడసాగింది. ఇంతలో వేలూరుకు వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఆగింది. బస్సు ఎక్కే సమయంలో డ్రైవర్ హఠాత్తుగా ముందుకు నడపడంతో సుశీలమ్మ బస్సులో నుంచి పడిపోగా వెనుకటైరు ఆమె కాళ్లపై ఎక్కింది. దీంతో కాలు కొంతభాగం నుజ్జయ్యింది. వెంటనే సీఎంసీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

దౌర్జన్యం చేస్తున్నారు.. రక్షణ కల్పించండి!



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): భూమిని ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేసినందుకు తమ కుటుంబంపై దౌర్జన్యం చేస్తున్నారని..వారి నుంచి రక్షణ కల్పించాలని యాదమరి మండలం పేరకూరు గొల్లపల్లెకి చెందిన నాగరాజు కుటుంబీకులు ఆరోపించారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగరాజుతో పాటు కుటుంబీకులు పవన్ కల్యాణ్, మణికంఠ, పార్వతీయులు మాట్లాడుతూ యాదమరి మండలం పేరకూరు గొల్లపల్లెలో నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమి తమ పూర్వీకులు చంద్రయ్య పేరుపై ఉండేదన్నారు. ఈ భూమిని రెండు ఏళ్ల క్రితం వీఆర్వో, గ్రామ సర్వేయర్ కలిసి అడంగల్‌లో శేఖర్ పేరిట మార్చేశారని తెలిపారు. రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సెటిల్మెంట్ భూమిని డీకేటీ భూమిగా మార్పులు చేసి తమకు తీవ్ర అన్యాయం చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమపై దౌర్జన్యం చేస్తున్న వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

'నిలువెత్తు' సేద్యం

వ్యవసాయాన్ని నమ్ముకున్న అన్నదాతలు ఆరుగాలం శ్రమించినా ఫలం దక్కకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. కొందరు మల్చింగ్ విధానం అనుసరిస్తున్నారు. మరికొందరు సరికొత్త వంగడాలు సాగు చేస్తున్నారు. ఇంకొందరు విదేశీ పంటలను ప్రయోగాత్మకంగా పండిస్తున్నారు. రైతులు నష్టాలు, కష్టాల నుంచి విముక్తి కోసం పాకులాడుతున్నారు. అందులో భాగంగా పాకే పంటలను సరికొత్తగా పండిస్తున్నారు. నిలువు పందిరి పంటలపై మక్కువ చూపుతున్నారు. కూలీల ఖర్చుకు స్వస్తి పలుకుతూ పొలమంత పందిరేసి కూరగాయల పంటలు చేస్తున్నారు. ఈ విధానంపై రైతులు మక్కువ చూపుతున్నారు. పడమటి మండలాల్లో ఉన్న రైతులు పరిస్థితులకనుగుణంగా పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు.

- నిలువు పందిరి సేద్యంపై రైతన్నల ఆసక్తి
- ఈ పద్ధతితో తీగపంటల సాగు ఇక సులువు
- తోటల్లో కర్రలకు నైలాన్ క్రీపర్ నెట్టింగ్
- దీంతో భారీగా తగ్గనున్న కూలీల ఖర్చు





నిలువు పందిళ్ల ద్వారా సాగవుతున్న దోస పంట (ఇన్‌సెట్) వైర్‌నెట్

పలమనేరు: సాధారణంగా తీగ పంటలైన దోస, బీర, కాకర, సొర, చిక్కుడు తదితర పంటలను జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఈ పంటలకు చేలలో ఇరువైపులా కర్రలు కట్టి వాటికి ట్వైన్ చుట్టుకుంటూ తీగలను అల్లించే విధానం ఇప్పటిదాకా చేస్తున్నారు. అయితే దీనికి కూలీలతో పని ఎక్కువ తోట పెరిగేలోపు నాలుగైదురోజులకోసారి తీగలను కర్రకు కట్టుకుంటా వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పుడలా కాకుండా నిలువు పందిరి విధానంతో నైలాన్ నెట్‌ను మొక్కకు పక్కనే నిలువుగా కట్టడం ద్వారా తీగలు వాటతంటకవే పాకుతూ పైకెళ్లిపోతాయి. మొక్కను కూలీలు తాకాల్సిన పని లేదు. ఫలితంగా రైతులకు భారీగా కూలీల ఖర్చు తగ్గి పంటసాగు సులభతరమైంది.

క్రీపర్ నెట్టింగ్ ఎలాగంటే..

నైలాన్ దారంతో విభిన్న కొలతల రంధ్రాలు కలిగిన నైలాన్ నెట్ ఉంటుంది. కావాల్సిన పంటను బట్టి సైజును తెచ్చుకోవాలి. వీటిని తోటలో రెండువైపులా కర్రలను కట్టి వాటికి రెండు వైపులా నిలువుగా వీటిని కట్టుకోవాలి. ఈ విధానాన్ని నైలాన్ గార్డెన్ ప్లాంట్ క్రీపర్ నెట్టింగ్ అని చెబుతున్నారు. ఇందులో ఎకరా పొలానికి ఐదు కిలోల నెట్ అవసరముంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో నైలాన్ నెట్ ధర నాణ్యతను బట్టి రూ.200 నుంచి రూ.350 వరకూ ఉంది. కొన్ని దుకాణాలతో పాటు ప్రముఖ ఆన్‌లైన్ సంస్థలైన అమేజాన్, ఫ్లిప్‌కార్ట్‌లోనూ వీటిని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఈ పద్ధతిలో పొరుగులో ఉన్న కోలారు, శ్రీనివాసపురం, చింతామణిలో పలువురు రైతులు ప్రయోగాత్మకంగా సాగుచేసి మంచి ఫలితాలను సాధిస్తున్నారు. దీన్ని గమనించిన ఇక్కడి రైతులు సైతం ఇక్కడ కొత్తగా సాగు చేస్తున్నారు. వీరిని గమనించిన చుట్టుపక్కల రైతులు సైతం ఇప్పుడిప్పుడే కొత్త విధానాన్ని అవలంభిస్తున్నారు.

భారీగా తగ్గనున్న కూలీల ఖర్చు

ఎకరా పొలంలో తీగజాతి పంటను సాగు చేయాలంటే మూడు నెలల పాటు 12 దఫాలు కూలీల అవసరముంటుంది. ఒక్కో దఫాకు ఆరుగురు కూలీలతో పని ఉంటుంది. ఆ లెక్కన 72 మంది కూలీలు కావాలి. ఒక్కో కూలీకి రోజుకి రూ.300 అనుకున్నా రూ.21,600 ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే నిలువు పందిరి ద్వారా ఎకరానికి నైలాన్ నెట్‌కు పెట్టే ఖర్చు రూ.2వేల లోపే ఉంటుంది. దానికి తోడు మళ్లీ పంటలకు ఇది ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో ఇలాంటి కొత్త పద్ధతులను ఇక్కడి రైతులు మరింతగా సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

నిలువు పందిరి సాగు చేస్తున్నా



మా బంధువుల ద్వారా కర్ణాటకలో ఈ విధానాన్ని చూసి తాము కూడా దోస తోటకు ఈ విధానంతోనే వైర్‌నెట్‌ను నిలువుగా కర్రలకు కట్టి సాగు చేస్తున్నాం. తీగలు చాలా వేగంగా నెట్‌కు అల్లుకుంటూ పోతున్నాయి. మా పంట నాటి నెల రోజులైంది. కూలీలతో పెద్దగా సమస్య లేకుండా పోయింది. కూలీల సమస్య నుంచి రైతులకు ఈ విధానంతో ఉపశమనం దొరికినట్టే. మా పంటను పలువురు రైతులు వచ్చి చూసి వెళుతున్నారు. వారికి తాము అవసరమైన సలహాలిస్తున్నాం.

– అమ్మణ్ణి, మారుమూరు, పలమనేరు మండలం

అవగాహన కల్పించాలి



పాతపద్ధతులు కాకుండా ఇలాంటి కొత్త పద్ధతులపై ఇక్కడి రైతులకు ఉద్యానశాఖ అవగాహన కల్పిస్తే బాగుంటుంది. ఇవి ఎక్కడ లభిస్తాయి, ఎలా అమర్చాలి తదితరాలపై రైతులకు చెబితేకదా. టమాటాలోనూ ట్వైన్ కట్టే పనిలేకుండా క్లిప్స్ వచ్చాయి. ఈ పద్ధతిని తాను కర్ణాటకలో చూసి అక్కడి రైతుల ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నా. కర్ణాటకలో కొత్త తరహా విధానాలను తెలుసుకొనేలా ఇక్కడి రైతులను అక్కడికి తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

– గోవిందురెడ్డి, బేరుపల్లి, పలమనేరు మండలం